సాక్షి
వైఎస్సార్ జిల్లా
బుధవారం, 4, సెప్టెంబర్, 2024



డ్రాగా ముగిసిన మ్యాచ్‌లు

కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్-23 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో పలు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లు మంగళవారం డ్రాగా ముగిశాయి. - 12లో



వరమిస్తారా... వదిలేస్తారా?

ప్రభుత్వం మద్యం దుకాణాల్లో పని చేసే వారిని తొలగిస్తారా? కొనసాగిస్తారా? అనే సందిగ్ధత వీడడం లేదు. టెండర్ విధానం అమల్లోకి వస్తే పరిస్థితి ఏమవుతుందో? - 12లో



వాతావరణం

జిల్లాలో మంగళవారం 25.3 - 34.1 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.3 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. -కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేటి నుంచి ఉరుసు



విద్యుద్దీప అలంకరణలో పెద్దదర్గా

కడప కల్చరల్: ప్రముఖ సూఫీ ఆధ్యాత్మిక, పర్యాటక క్షేత్రమైన కడప పెద్ద దర్గాలో బుధవారం నుంచి మూడు రోజులపాటు ఉరుసు నిర్వహించనున్నారు. హజరత్ ఖ్వాజా సయ్యద్ షా అమీనుల్లా మొహమ్మద్ మొహమ్మదుల్ హుస్సేని చిష్తివుల్ ఖాద్రి సాహెబ్ పేరిట నిర్వహించనున్న ఈ ఉత్సవాల్లో భాగంగా 4న గంధం, 5న ఉరుసు, 6న తహలీల్ ఫాతెహా నిర్వహిస్తారు. ఉరుసు రోజున ప్రముఖ ఖవ్వాలీ గాయకులు మిరాట్‌కు చెందిన అమిల్ ఆరిఫ్ సాబ్రిచే కచేరి ఉంటుందన్నారు.

ఏఎస్‌ఐలు, కానిస్టేబుళ్ల బదిలీలు

కడప అర్బన్: జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్‌స్టేషన్‌లలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందిని బదిలీ చేస్తూ ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఐదేళ్లు పూర్తి చేసుకున్న ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లను ఈ జాబితాలో చేర్చారు. జిల్లా వ్యాప్తంగా 44 మంది ఏఎస్ఐలు, 93 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 124 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు. బదిలీ అయిన సిబ్బంది తమకు కేటాయించిన పోలీస్‌స్టేషన్‌లో రిపోర్ట్ చేసుకోవాలనీ ఎస్పీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు గడువు పొడిగింపు

కడప ఎడ్యుకేషన్: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు సంబంధించిన దరఖాస్తు గడువును సెప్టెంబర్ 17వ తేదీ వరకు పొడగించినట్లు డీఈఓ మర్రెడ్డి అనురాధ తెలిపారు. డిసెంబర్ 8వ తేదీ నిర్వహించే ఈ పరీక్ష కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకొనుటకు ఆన్‌లైన్ అప్లికేషన్‌ను ప్రభుత్వ పరీక్షల కార్యాలయ వెబ్‌సైట్ www.bse.ap.gov.inలో అందుబాటులో ఉందని తెలిపారు. మరిన్ని వివరాలకు ప్రభుత్వ పరీక్ష సంచాలకుల కార్యాలయ వెబ్‌సైట్ www.bse.ap.gov.in లో లేదా డీఈఓ కార్యాలయంలో సంప్రదించాలని డీఈఓ తెలిపారు.

పవిత్రోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ



ఉత్సవ మూర్తులకు పూజలు చేస్తున్న వేదపండితులు

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట కోదండరామాలయంలో మంగళవారం ఆలయ ప్రధాన అర్చకులు వీణా మనోజ్ కుమార్ చార్యులు మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ పవిత్రోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. ఆలయ టీటీడీ సూపరింటెండెంట్ హనుమంతయ్య, ఇన్‌స్పెక్టర్ నవీన్‌ల సమక్షంలో పూజలు జరిగాయి. రంగమండపంలో సీతారామ లక్ష్మణ ఉత్సవ మూర్తులను పట్టు వస్త్రాలు, పుష్ప మాలికలు, ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా దాశరథి సన్నిధిలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. సూపరింటెండెంట్ హనుమంతయ్య మాట్లాడుతూ బుధ, గురు, శుక్రవారం మూడు రోజులపాటు రామయ్య క్షేత్రంలో ప్రత్యేక హోమాలు నిర్వహిస్తామని తెలిపారు.

ప్రయాణికులకు ఉత్తమ సేవలు



ఎక్కువ కేఎంపీయల్ తెచ్చిన డ్రైవర్లను అభినందిస్తున్న ఈడీ చెంగల్‌రెడ్డి

రాయచోటి అర్బన్: ప్రయాణికులకు మరింతగా ఉత్తమ సేవలు అందించేందుకు ఉద్యోగులు, సిబ్బంది కృషి చేయాలని ఆర్టీసీ కడప జోన్-4 ఈడీ టి. చెంగల్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం ఆయన రాయచోటి డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన కార్మికులనుద్దేశించి మాట్లాడుతూ బస్సులను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎలాంటి లోపాలు లేకుండా బస్సు సర్వీసులను నడపడం ద్వారా ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. వీలైనంతవరకు ఎక్కువ కేఎంపీఎల్ వచ్చేలా చూడాలన్నారు. కేఎంపీయల్ ఎక్కువగా తీసుకువచ్చిన డ్రైవర్లను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. అనంతరం గ్యారేజిని పరిశీలించి అక్కడి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి హామీ ఇచ్చారు.

కంటతడి మిగిల్చినా.. ఆరుతడిపైనే ఆశలు

ఈసారి ఖరీఫ్‌లో సాగు చేసిన ఆరుతడి పంటలు రైతన్నకు కంట తడినే మిగిల్చాయి. కష్టం 'నేల'పాలయిందని నీరుగారిపోలేదు.. నష్టం మరోసారి పలకరించిందని నిరాశలో ఉండిపోలేదు.. నేల తల్లినే నమ్ముకున్న రైతు బిడ్డ ... ఆశల్నే శ్వాసగా మార్చుకుని ముందడుగు వేస్తున్నాడు. ఎండిపోయిన 'మినుము'స్థానంలోనే మిణుకు మిణుకుమనే కొత్త విత్తనాల ఆశల్ని చల్లేందుకు మరోసారి సిద్ధమయ్యాడు.

- గతంలో సాగుకానీ, వర్షం లేక ఎండిన పంటలకు విత్తనాలు మంజూరు
- జిల్లావ్యాప్తంగా 19,995 హెక్టార్లలో సాగుకానున్న ఆరుతడి పంటలు
- 80 శాతం సబ్సిడీతో రైతులకు విత్తనాల పంపిణీకి సిద్ధం
- జిల్లాకు 3,843 క్వింటాళ్ల కేటాయింపు



కమలాపురం ప్రాంతంలో వర్షం లేక ఎండిపోయిన మినుముపంట

కడప అగ్రికల్చర్: జిల్లావ్యాప్తంగా ఈ సారి ఖరీఫ్ సీజన్ నష్టాల్నే మిగిల్చింది. ముఖ్యంగా జులై, ఆగస్టు నెలల్లో వర్షం లేక పంటలు ఎండిపోయాయి. ప్రస్తుతం ఎండిపోయిన ఈ పంటలస్థానంలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు వ్యవసాయశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందుకోసం జిల్లావ్యాప్తంగా ఐదు రకాల విత్తనాలైన మినుములు, ఉలవలు, పెసర, జొన్న, అలసంద విత్తనాలను అందించేందుకు సన్నద్ధమవుతోంది. సంబంధిత విత్తనాలు అవసరమయిన రైతులకు 80 శాతం సబ్సిడీతో అందించనుంది. ఇందుకు సంబంధించిన విత్తనాలను ఆయా మండలాలకు కేటాయించింది.

జిల్లావ్యాప్తంగా 19,995 హెక్టార్లలో ...

జిల్లావ్యాప్తంగా 19,995 హెక్టార్లలో ఆరుతడి పంటలు సాగుకు అధికారులు ప్రణాళిక రచించారు. ముఖ్యంగా కమలాపురం నియోజకవర్గంలో వల్లూరు, కమలాపురం, వీఎన్‌పల్లి, ఎర్రగుంట్లతో పాటు పలు మండలాల్లో ఖరీఫ్ ప్రారంభంలోనే వర్షాలు కురవడంతో మినుమపంట, జొన్న, వేరుశనగ, పొద్దుతిరుగుడులతోపాటు పలు పంటలు సాగు చేశారు. ఆ తర్వాత జూలై, ఆగస్టు నెలల్లో వర్షాలు లేక సాగు చేసిన మినుముపంట పూర్తిగా ఎండిపోయింది. ఫలితంగా జిల్లా వ్యాప్తంగా 5 నుంచి 7 వేల ఎకరాలకు పైగా మినుమపంటను దున్నేశారు. ఇక జూన్ తరువాత వర్షాలు వస్తే ఆరుతడి పంటలు సాగు చేద్దామనుకున్న రైతులు సరైన వర్షాల్లేక భూములను బీళ్లుగా వదిలేశారు. దీంతో అటు పంట దెబ్బతిన్న రైతులతో పాటు సాగు చేయని రైతుల కోసం ప్రభుత్వం సబ్సిడీ విత్తనాలను మంజూరు చేసింది. జిల్లాకు మొత్తం 3843 క్వింటాళ్లు సబ్సిడీ విత్తనాలు మంజూరయ్యాయి.. ఇందులో జొన్న, మినుము, అలసంద, ఉలవలు, పెసలు ఉన్నాయి.

వర్షాల జోరు.. ఆశల చిగురు



జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం జోరు వర్షాలు కురుస్తున్నాయి. అలాగే రాబోయే రోజుల్లోనూ మంచి వానలే ఉంటాయని వాతావరణశాఖ చెబుతోంది. గతంలో పంట నష్టపోయి కంట నీరు పెట్టిన రైతులు ఈసారైనా లాభాలు కళ్లజూడక పోతామా అంటూ కోటి ఆశలతో సాగుకు సిద్ధమవుతున్నారు. మరోవైపు అధికారులు కూడా ఆరుతడి పంటలసాగుకు ఈ వాతావరణం అనుకూలమేనని వివరిస్తున్నారు.

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రైతులు ఈ ఆరుతడి పంటలను సాగు చేయనున్నారు. విత్తనాలు కావాల్సిన రైతు వారి పరిధిలోని రైతు సేవా కేంద్రాల నుంచి విత్తనాలను పొందాలని వ్యవసాయ అధికారులు సూచించారు.

జిల్లాకు విత్తనాల కేటాయింపు వివరాలు ఇలా...

పంటరకం	మంజూరు క్వింటాళ్లు	పూర్తిధర కిలో(రూ.)	రాయితీ	రైతు వాటా
మినుము	2001	140	112	28
ఉలవలు	500	87	69.60	17.40
పెసర	992	130	104	26
అలసంద	200	113	90.40	22.60
జొన్న	150	-	-	-

సాగు చేసిన పంటనంతా దున్నేశా



జూన్ నెలలో కురిసిన వర్షానికి ఏడు ఎకరాల్లో మినుముపంటను సాగు చేశాను. తర్వాత వర్షం లేక 7 ఎకరాల మినుముపంట ఎండిపోయింది. దీంతో చేసేదిలేక పంట మొత్తం దున్నేశాను. సేద్యం, విత్తనాలు ఇతర ఖర్చులతో ఏడు ఎకరాలకు 1,05,000 వేలు ఖర్చు అయ్యింది. పంట ఎండిపోవడంతో పూర్తిగా నష్టపోయాను. మళ్లీ ఇప్పుడు సాగు చేద్దామనుకుంటున్నా. ఈ సారైనా మంచి దిగుబడి వస్తే నష్టం లేకుండా బయటపడతాం. – చెన్నం దివాకర్‌రెడ్డి, కంచన్నగారిపల్లె, కమలాపురం

మండలాలకు కేటాయించాం



ఈ ఖరీఫ్‌లో ఇదివరకు పంటలు సాగు చేయని వాళ్లతో పాటు, గతంలో వర్షంలేక ఎండిపోయిన పంటల స్థానంలో సాగు చేసుకునేందుకు వీలుగా ప్రభుత్వం ఐదు రకాల విత్తనాలను మంజూరు చేసింది. సంబంధిత విత్తనాలను 80 శాతం సబ్సిడీతో రైతులకు అందించనున్నాం. విత్తనాలను ఆయా మండలాలకు కేటాయించాం. కావాల్సిన రైతులు ఆయా రైతు సేవా కేంద్రాల ద్వారా పొందవచ్చు. – అయితా నాగేశ్వరావు, జిల్లా వ్యవసాయ అధికారి

చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు

జిల్లా చేనేత, జౌళి శాఖ ఏడీ నాగరాజారావు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా చేనేత, జౌళి శాఖ ఏడీ నాగరాజారావు

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లాలోని 184 చేనేత సంఘాలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు నాగరాజారావు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్లోని జిల్లా నీటి యాజమాన్య సంస్థ సమావేశపు హాలులో చేనేత సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్టోబర్ 21 నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమై డిసెంబర్ 6 నాటికి ముగుస్తుందని వెల్లడించారు.

డిసెంబర్ 7 నుంచి కొత్త అధ్యక్షులు బాధ్యతలు చేపడతారన్నారు. సంఘాలకు సంబంధించిన బైలా కాపీలు, మినిట్స్ బుక్ ,క్యాష్ బుక్, సభ్యుల జాబితా, రెండు రకాల సీళ్లు చేనేత జౌళి శాఖ కార్యాలయంలో అందించాలని ఆదేశించారు. చనిపోయిన సొసైటీ సభ్యులను రౌండప్ చేయాలన్నారు. సొసైటీకి సంబంధించిన గ్రామాలలో లేని వారిని కూడా ఓటర్ల జాబితా నుంచి తొలగించాలన్నారు. సంఘ కార్యకలాపాల్లో రెగ్యులర్‌గా పాల్గొననివారికి ఓటు హక్కు ఉండదని స్పష్టం చేశారు. సొసైటీకి, బ్యాంకుకు సంబంధించిన డబ్బులు సకాలంలో చెల్లించనివారికి కూడా ఓటు హక్కు ఉండదన్నారు. ఎన్నికల వ్యయాన్ని సహకార సంఘాలే భరించాలని తెలిపారు. రికార్డులు సక్రమంగా సమర్పించిన సంఘాలకే కలెక్టర్ అనుమతితో ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలో చేనేత సహకార సంఘాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని.. సంఘాల వ్యవహారాలన్నీ కంప్యూటీకరణ చేసేందుకు ముందుకు రాకపోవడం తగదన్నారు. ప్రభుత్వ పథకాల కోసం చూపినంత ఉత్సాహం సంఘాలను సక్రమంగా నిర్వహించేందుకు ముందుకు రాకపోవడం బాధగా ఉందని అసంతృప్తి వ్యక్తం చేశారు. చేనేత సహకార సంఘాల ఎన్నికల ప్రక్రియ సజావుగా పూర్తయ్యేందుకు సంఘాల ప్రతినిధులు పూర్తిగా సహకరించాలన్నారు. ఈ సమావేశంలో డెవలప్‌మెంట్ ఆఫీసర్లు మహమ్మద్ మోదీన్, డి.కృష్ణ, పి.నారాయణమ్మ, ఏడీఓలు సీవీ శేషగిరిరావు, రవి ప్రకాష్ రెడ్డి, వనిత , చేనేత సహకార సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

విమానాశ్రయ అభివృద్ధికి చర్యలు

కలెక్టర్ శివశంకర్ లోతేటి



మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

కడప సెవెన్‌రోడ్స్: పర్యావరణానికి ఎలాంటి అంతరాయం లేకుండా నిబంధనలకు లోబడి కడప ఏరోడ్రమ్ అభివృద్ధి పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్, ఏరోడ్రమ్ కమిటీ చైర్మన్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. మంగళవారం కడప విమానాశ్రయం టర్మినల్ బిల్డింగ్‌లో కలెక్టర్, ఏరోడ్రమ్ కమిటీ చైర్మన్ శివశంకర్ లోతేటి అధ్యక్షతన కడప ఏరోడ్రమ్, ఎయిర్ ఫీల్డ్ ఎన్విరాన్మెంట్ మేనేజ్మెంట్ కమిటీల సమావేశం జరిగింది. సేఫ్టీ, సెక్యూరిటీకి సంబంధించిన పలు విషయాలను, ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలను కల్పించేందుకు, విమానాశ్రయ అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలపై కమిటీ చర్చించింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కడప విమానాశ్రయం నుంచి భవిష్యత్తులో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని నూతన టెర్మినల్ భవన నిర్మాణానికి భారతీయ విమానాశ్రయాల ప్రాధికార సంస్థ తగు చర్యలు చేపట్టిందన్నారు. రూ.266 కోట్ల వ్యయంతో నూతన టెర్మినల్ భవన అభివృద్ధి పనులు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ పనులు పూర్తయితే కడప విమానాశ్రయం అత్యుత్తమ శ్రేణి ఎయిర్ పోర్ట్‌గా ప్రాముఖ్యత సంతరించుకోనుందన్నారు. రెండు వారాల్లో పర్యావరణ, అటవీశాఖ అనుమతులను పరిశీలించి మౌలిక సదుపాయాల ఏర్పాటుకు అవసరమైన అన్ని రకాల చర్యలను చేపట్టనున్నట్లు తెలిపారు. ఎయిర్ పోర్ట్ పరిసరాలను స్వచ్ఛంగా, పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచడంలో కడప మున్సిపల్ కమీషన్, పంచాయతీ రాజ్ శాఖలు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలన్నారు. ఎస్పీ హర్షవర్ధన్ రాజు, డీఎఫ్ఓ సందీప్ రెడ్డి, విమానాశ్రయం డైరెక్టర్, కమిటీ కన్వీనర్ సుజిత్ కుమార్ పోదర్, ఏపీఎస్పీఎఫ్ కాషో ఆనందయ్య, సభ్యులు అదనపు మున్సిపల్ కమీషనర్ రాకేష్ చంద్ర పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యల పరిష్కారం

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల ద్వారా గ్రామాల్లో దీర్ఘకాలంగా ఉన్న భూ సమస్యలు పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని కలెక్టర్ శివశంకర్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులు, వివిధ రాజకీయ పక్షాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో చేపడుతున్న రెవెన్యూ సదస్సుల నిర్వహణపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రణాళిక ప్రకారం నిర్ణయించిన తేదీల్లో నిర్దేశించిన గ్రామంలో ఉదయం 9 నుంచి సదస్సులు నిర్వహించాలన్నారు. సదస్సుల్లో మ్యూటేషన్లు, భూ వివాదాలు, భూ ఆక్రమణలు, 22ఏ దుర్వినియోగం, తదితర అంశాలపై అర్జీలు స్వీకరిస్తారన్నారు. అదేరోజు అర్జీ ఆన్‌లైన్‌లో నమోదు చేసి విచారణ నిర్వహిస్తామన్నారు. ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి, జేసీ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికి నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం గ్రీవెన్స్ హాలులో మధ్యాహ్న భోజనం, ప్రభుత్వ పాఠశాలల్లో తీసుకోవాల్సిన చర్యలపై విద్యాశాఖ అధికారులు,హెచ్‌ఎంలు, వ్యాయామ ఉపాధ్యాయులు,పేరెంట్స్ కమిటీలతో ఒక రోజు వర్క్ షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేరెంట్స్ కమిటీలు పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలించాలన్నారు. తొమ్మిది,పదవ తరగతిలలో చదువుతున్న విద్యార్థులకు మెంటల్ ఎబిలిటీ, జనరల్ నాలెడ్జ్‌పై పరీక్ష నిర్వహించి అందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి విశాఖపట్నం టూర్ వెళ్లేలా ప్లాన్ చేసుకోవాలని హెడ్మాస్టర్లను ఆదేశించారు.

స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలి

- రెడ్ బుక్ రాజ్యాంగం అమలు తప్పా ఈ ప్రభుత్వం చేసిందేమీ లేదు
- రాజధానిగా అమరావతి ఎంత ప్రమాదకరమో తెలిసొచ్చింది
- 3 నెలల్లోనే రూ.15వేల కోట్లు అప్పులు చేశారు
- మండల కన్వీనర్లు, జేసీఎస్ ఇన్‌చార్జుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు పనిచేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కడపలోని పార్టీ జిల్లా కార్యాలయంలో అన్ని మండలాల కన్వీనర్లు, జేసీఎస్ ఇన్‌చార్జులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీలు డీసీ గోవిందరెడ్డి, రమేష్ యాదవ్, ఎంపీ రామచంద్రారెడ్డి, బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మాజీ ఎమ్మెల్యేలు రఘురామిరెడ్డి, డాక్టర్ సుధీర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన ఈ మూడు మాసాల్లో రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేసి వైఎస్సార్‌సీపీ కోసం పనిచేసిన వారిపై దౌర్జన్యాలు, దాడులు చేయడం తప్పా చేసిందేమీ లేదని మండిపడ్డారు. స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను భయపెట్టి, ప్రలోభపెట్టి పోటీ చేయనీకుండా చేయాలనే ఆలోచనతో టీడీపీ నాయకులు ఉన్నారన్నారు. దీన్ని మనం సమర్థవంతంగా ఎదుర్కోవాలన్నారు. పింఛన్లు, ఉద్యోగులకు జీతాలు ఇవ్వడం తప్పా ప్రభుత్వం చేసిన ఒక్క గొప్పపని లేదన్నారు. కేవలం మూడు నెలల్లో ఈ ప్రభుత్వం రూ.15వేల కోట్లు అప్పులు చేసిందని ప్రతి మంగళవారం అప్పులు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. 2019లో ఓడిపోయిన తర్వాత మూడేళ్లు చంద్రబాబు అస్సలు కనిపించలేదని గుర్తు చేశారు. రాజధానిగా అమరావతి ఎంత ప్రమాదకరమైందో అందరికీ తెలిసొచ్చిందన్నారు. వైఎస్ జగన్ సేఫ్టీ వాల్స్, కరకట్టలు కట్టడం వల్ల చాలామేరకు ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించడం సాధ్యమైందన్నారు. పార్టీ కార్యకర్తలకు ఎక్కడ అన్యాయం జరిగినా తామంతా అందుబాటులో ఉంటామని ఆయన మరోసారి భరోసా ఇచ్చారు. 2029లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకునేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలు రచించాలని సూచించారు. మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలనే పట్టుదలతో కార్యకర్తలను, నాయకులను విస్మరించడం జరిగిందని, ఇకపై ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు అందరం కృషి చేస్తామని స్పష్టం చేశారు. కార్యకర్తలకు, నాయకులకు భరోసా కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. అక్రమ కేసులు బనాయిస్తే న్యాయ సహాయం కోసం లీగల్ సెల్ ఏర్పాటు చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీలో మండల కన్వీనర్లది కీలకపాత్ర అని, కార్యకర్తలకు ఏం జరిగినా వారిపై పోలీసుల దెబ్బ పడకుండా కాపాడుకోవాలన్నారు. ప్రతినెలా ఒక నియోజకవర్గంలో కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు.

- ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ మాట్లాడు తూ అన్ని నియోజకవర్గాల్లో పార్టీని బలోపేతం చేయడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం మండల కన్వీనర్లు, జేసీఎస్ ఇన్‌చార్జులను పరిచయం చేసుకొని అభిప్రాయాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ జిల్లా కన్వీనర్ కె. నాగేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు పులి సునీల్, పి. జయచంద్రారెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, నిత్యానందరెడ్డి, రఘునాథరెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, షఫీ, తోటక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడితే ఉద్యోగం నుంచి తొలగింపు

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రామాపురం: విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడితే సంబంధిత వ్యక్తులను ఉద్యోగం నుంచి తొలగిస్తామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం మండలంలోని నీలకంఠ్రావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి సమస్యలున్నా ధైర్యంగా ముందుకు వచ్చి అధికారులకు, ప్రజా ప్రతినిధులకు తెలియజేయాలన్నారు. ఇక నుంచి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలను, వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తానన్నారు. విద్యార్థుల సమస్యలు తెలియజేసేందుకు పాఠశాలలు, వసతి గృహాలలో తప్పకుండా ఫిర్యాదుల బాక్సును ఏర్పాటు చేయాలన్నారు. నీలకంఠ్రావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మంత్రి పరిశీలించి అన్నం సరిగా ఉడకలేదని, నాణ్యతగా లేదని సంబంధిత సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతి చెందిన శ్రీనివాసులురెడ్డి

ముద్దనూరు : మండలంలోని యామవరం సమీపంలో మోటార్ బైక్, స్కూటీని ఢీకొన్న సంఘటనలో శ్రీనివాసులురెడ్డి(50) మృతి చెందాడు. ఏఎస్ఐ ఆంజనేయులు సమాచారం మేరకు.. చింతకుంట గ్రామానికి చెందిన శ్రీనివాసులురెడ్డి మంగళవారం తన స్వగ్రామం నుంచి ముద్దనూరుకు బైక్‌లో వెళ్తున్నారు. యామవరం సమీపంలోకి రాగానే అదే గ్రామానికి చెందిన కిరణ్ కుమార్‌రెడ్డి స్కూటీలో వచ్చి శ్రీనివాసులురెడ్డి బైక్‌ను ఢీకొన్నాడు .ఈ ఘటనలో శ్రీనివాసులురెడ్డి తలకు తీవ్ర గాయం కాగా, స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే క్షతగాత్రుడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

9 మందికి ఇంటి విక్రయం



బాధితుడు ఇంతియాజ్ బాషా

కడప అర్బన్ : కడప నగరంలోని సాయిపేటలోని ఏ-వన్ నగర్‌లోని ఓ ఇంటిని 2015లో కొనుగోలు చేశామని, అప్పటినుంచి తనకు ఇంటిని విక్రయించిన వ్యక్తి నూరుద్దీన్, అమీనుద్దీన్‌తో కలిసి 9 మందికి విక్రయించారని బాధితుడు ఇంతియాజ్ ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజుకు మంగళవారం ఫిర్యాదు చేశారు. కడపకు చెందిన నూరుద్దీన్, అమీనుద్దీన్‌తో కలిసి తనను చంపుతామని బెదిస్తున్నారని, తనకు, తన కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న చింతన్న

లింగాల : కుటుంబ సమస్యలతో ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఎస్సై మధుసూదన్ వివరాల మేరకు.. మండలంలోని కోమన్నూతల గ్రామానికి చెందిన చెంచుగాళ్ల చింతన్న(63) గత కొద్ది కాలంగా మద్యానికి బానిసయ్యారు. మద్యం తాగి తాను ఆత్మహత్య చేసుకుంటానంటూ ఇంటిల్లిపాదినీ బెదిరిస్తూ ఉండేవారు. ఆయన మాటలు ఎవరూ పట్టించుకోకపోవడంతో స్థానిక ఎస్సీ కాలనీ సమీపంలోని జిల్లా పరిషత్ పాఠశాల సమీపంలో వాటర్ ట్యాంకు వద్ద మంగళవారం వేప చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన మృతదేహాన్ని పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వరమిస్తారా.. వదిలేస్తారా..!

ప్రభుత్వం మద్యం దుకాణాల్లో పని చేసే వారిని కొలువు కొనసాగించే వరమిస్తారా? వదిలేస్తారా అనే సందిగ్ధత వీడడం లేదు. టెండర్ విధానం అమలులోకి వస్తే మద్యం ధరలు తగ్గిస్తామన్న నేపథ్యంలో ప్రైవేట్ ఏజెన్సీలకు నిర్వహణ అప్పగిస్తారా? కూటమి ప్రభుత్వ పాలకుల హడావిడి చూస్తే ఇదంతా అవుననే అనిపిస్తోంది.

- సేల్స్‌మెన్, సూపర్ వైజర్ల ఉద్యోగ భద్రతపై ఆందోళన
- అక్టోబర్ 1వ తేదీ నుంచి నూతన పాలసీ అమలు
- నేటి నుంచి ఉద్యమ బాటలో మద్యం దుకాణాల సిబ్బంది
- టెండర్‌తో దుకాణం తీసుకునేందుకు కూటమి నేతల యత్నం



ప్రభుత్వ మద్యం దుకాణం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కూటమి ప్రభుత్వం అక్టోబర్ ఒకటో తేదీ నుంచి రాష్ట్రంలో ప్రవేశపెట్టే నూతన మద్యం పాలసీ తమపై ప్రభావం చూపుతుందని మద్యం దుకాణాల్లో పనిచేసే ఉద్యోగుల్లో అప్పుడే ఆందోళన మొదలైంది. నూతన మద్యం పాలసీతో తమ ఉద్యోగాలు ప్రశ్నార్థకంగా మారతాయని ఉద్యోగులు భావిస్తున్నారు. దీంతో ఈ నెల 4వ తేదీ నుంచి వారు ఆందోళన బాట పట్టనున్నారు. ప్రభుత్వం స్పందించకపోతే 7వ తేదీ నుంచి బంద్‌కు పిలుపునిచ్చి సామూహిక రాజీనామాలు సమర్పించనున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ఉపాధి

2019కు ముందు మద్యం దుకాణాల నిర్వహణకు టీడీపీ ప్రభుత్వం ప్రతి రెండేళ్లకోసారి టెండర్లు పిలిచి లాటరీల ద్వారా దుకాణాలు కేటాయించింది. ఇవి ప్రైవేట్‌గా కొందరి ఆజమాయిషీలో నడిచేవి. ఈ దోపిడీని అరికట్టేందుకు 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం అక్రమాలకు చెక్ పెట్టి ప్రభుత్వ మద్యం దుకాణాలకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా పది, ఇంటర్, డిగ్రీ చదివిన విద్యావంతులను సూపర్ వైజర్, సేల్స్‌మెన్, వాచ్‌మెన్లుగానూ కాంటాక్టు, అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన నియమించి ఉపాధి కల్పించింది. వైఎస్సార్ జిల్లాలో 124 ప్రభుత్వ మద్యం దుకాణాల్లో 496 మంది వరకు ఉద్యోగులు దాదాపు ఐదేళ్లపాటు ఎలాంటి కష్టాలు లేకుండా విధులు నిర్వర్తించారు. ఈ లెక్కన వారిలో సూపర్ వైజర్‌కు రూ.19500, సేల్స్ మేన్‌కు రూ.16500, వాచ్‌మెన్‌కు రూ.10వేల జీతం ఇస్తున్నారు. వారి కుటుంబాల జీవనోపాధికి అదే ఆసరాగా మారింది. అంతేగాక గ్రామాల్లో బెల్ట్ షాపులు, సారా అమ్మకాలకు సైతం అడ్డుకట్ట వేసింది.

కూటమి పాలనలో అనిశ్చితి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఏపీలో అక్టోబరు 1 నుంచి నూతన మద్యం పాలసీ అమలులోకి తేనున్నట్లు మంత్రి కొల్లురవీంద్ర ఇదివరకే ప్రకటించారు. తాజాగా ప్రభుత్వ మద్యం దుకాణాలకు బదులు టెండర్ల ద్వారా ప్రైవేటు మద్యం దుకాణాల ఎంపికకు శ్రీకారం చుట్టనున్నారు. దీనికి సంబంధించి టెండర్ల ప్రక్రియ సైతం కొనసాగుతోంది. మద్యం పాలసీతో అంతిమంగా లబ్ధి పొందేది కాంట్రాక్టర్లు, టీడీపీ నేతలు, రాజకీయ నాయకులే. కూటమి నేతలు కూడా ఇప్పటికే ఈ మద్యం దుకాణాల నిర్వహణకు ప్రయత్నాలు చేస్తున్నారని తెలుస్తోంది.

అవసరమైతే బంద్‌కు పిలుపు..

కూటమి ప్రభుత్వ మద్యం దుకాణాల్లో సేల్స్‌మెన్లు, సూపర్ వైజర్లు, వాచ్‌మెన్లను కొనసాగిస్తారా? తొలగిస్తారా? అనే విషయంలో స్పష్టత ఇవ్వలేదు. దీంతో జిల్లాలోని నిరుద్యోగులు తమ భవిష్యత్తుపై ప్రకటన చేయాలని ఏపీ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు చంద్రబాబుకు బహిరంగ లేఖ ద్వారా వివరించారు. 2019లో జాయింట్ కలెక్టర్ ద్వారా తాము నియమితులమయ్యామని, కరోనా సమయంలో ప్రభుత్వ ఆదాయం తగ్గకూడదని ప్రాణాలను లెక్కచేయకుండా పనిచేశామని చెప్పారు. నూతన మద్యం పాలసీతో తమ ఉద్యోగ భద్రతపై ఆందోళన కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు అన్యాయం జరగకూడదని బుధవారం నుంచి నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు అవసరమైతే ఈ నెల 7న బంద్‌కు పిలుపునిస్తామని తెలిపారు.

స్టీల్‌ప్లాంటు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

– పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి



కలెక్టర్‌కు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న పీసీసీ అధ్యక్షురాలు షర్మిల

కడప సెవెన్‌రోడ్స్ : వైఎస్సార్ జిల్లాలో ఉక్కు కర్మాగారం ఏర్పాటుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కలెక్టర్ లోతేటి శివశంకర్‌కు ఈ మేరకు మంగళవారం ఆమె వినతిపత్రాన్ని సమర్పించారు. జిల్లాలో పారిశ్రామికీకరణ ద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో నాటి ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖరరెడ్డి ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేయాలని భావించారన్నారు. ఆయన మరణానంతరం ప్రాజెక్టు పట్టాలు తప్పిందని తెలిపారు. 2014లో ఉక్కు కర్మాగారం ఏర్పాటుకు యూపీఏ ప్రభుత్వం నిబంధనలు రూపొందించిందన్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన బీజేపీ దానిని విస్మరించిందని విమర్శించారు. దశాబ్ద కాలంగా బీజేపీతోపాటు టీడీపీ, వైఎస్సార్‌సీపీ ఈ విషయాన్ని పట్టించుకోలేదని ఆరోపించారు. ఏపీ పునర్ వ్యవస్థీకరణ చట్టం హామీలను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతుందని హెచ్చరించారు.

అప్రమత్తంగా లేకపోవడం వల్లే దారుణం

ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



పోరుమామిళ్ల : ప్రభుత్వం అప్రమత్తంగా లేకపోవడంతోనే వరద తాకిడితో విజయవాడ అల్లాడిపోతోందని, లక్షలాదిమంది నిరాశ్రయులయ్యారని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి అన్నారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ వాతావరణ శాఖ హెచ్చరికతో ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు తీసుకొని, ప్రజలను అప్రమత్తం చేసి ఉంటే పరిస్థితి సమస్య ఉండేది కాదన్నారు. 48 గంటలు దాటినా వరద బాధితులను చేరుకునేందుకు అవకాశం లేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. రెండు అంతస్తుల దాకా నీరు వచ్చిందంటే ప్రజల దయనీయస్థితి అర్థమవుతోందన్నారు. రక్షణ చర్యలు వేగవంతం చేసి అంటు రోగాలు ప్రబలకుండా చూడాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రిటైనింగ్ వాల్ నిర్మించడంతో ఎంతో ప్రమాదం తప్పిందని, కృష్ణ లంకలో లక్షలమంది వరద నుంచి బయటపడ్డారన్నారు. ముఖ్యమంత్రి అధికారులు వద్ద ఉండడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుగోందన్నారు. ఈ కార్యక్రమంలో సీఎం.బాషా, మాజీ ఉప సర్పంచి రాళ్లపల్లె నరసింహులు పాల్గొన్నారు.

ప్రాచీన శాసనానికి పట్టం కట్టిన కలెక్టర్

తెలుగు భాషోత్సవ నిర్వహణ కమిటీ ప్రశంస



కలెక్టర్ లోతేటి శివశంకర్‌ను సన్మానిస్తున్న బాషోత్సవ నిర్వహణా కమిటీ సభ్యులు

కడప ఎడ్యుకేషన్ : కలమల్లలో తెలుగు భాషా దినోత్సవం వేడుక ఘనంగా నిర్వహించడంలో క్రియాశీలక పాత్ర పోషించిన కలెక్టర్ లోతేటి శివశంకర్‌ను డీఈఓ మర్రిడ్డి అనురాధ ఆధ్వర్యంలో ఆయన బంగ్లాలో తెలుగు భాషోత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా భాషోత్సవ నిర్వహణ కమిటీ సమన్వయకర్తలు మేరి, పాలెం మహేష్‌బాబు మాట్లాడుతూ రేనాటి చోళరాజు ధనుంజయుడు వేయించిన కలమల్ల శాసన వైభవాన్ని కలెక్టర్ గుర్తించి పూర్వ వైభవాన్ని తీసుకువచ్చారని తెలిపారు. కవులకు నిలయమైన కడప జిల్లాలో తెలుగు కవితా వైభవాన్ని పునరుజ్జీవింపచేయుటకు కృషి చేయాలని వారు కోరారు. కలెక్టర్ లోతేటి శివశంకర్ మాట్లాడుతూ తెలుగు భాష ఏ ఒక్కరి సొత్తుగా భావించకుండా, సంస్కృతి, సంప్రదాయాలకు నిలయంగా భావించాలన్నారు. విద్యార్థులు భాషా నైపుణ్యంపై పట్టు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో భాషోత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు రవికుమార్, గాజులపల్లి గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కువైట్‌లో మహానేతకు ఘన నివాళి



కువైట్‌లో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



యూఎస్ఏలో దివంగత సీఎం వైఎస్సార్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

కడప కార్పొరేషన్: దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.యస్.రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ కువైట్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ కువైట్ కన్వీనర్ ఎం.బాలిరెడ్డి మాట్లాడుతూ మహానేత వై.యస్.రాజశేఖర్‌రెడ్డి లేని లోటు రాష్ట్ర ప్రజలకు స్పష్టంగా కనిపిస్తోందని, సూర్య, చంద్రులు ఈ భూమి ఆకాశం ఉన్నంత వరకు ప్రతి తెలుగు వాడి గుండెల్లో వైఎస్సార్ శాశ్వతంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గల్ఫ్ కో కన్వీనర్ గోవిందు నాగరాజు, గల్ఫ్ సలహాదారులు నాయని మహేశ్వర్ రెడ్డి, కువైట్ కో కన్వీనర్ రమణ యాదవ్, మైనార్టీ నాయకులు షేక్ రహమతుల్లా, అప్సర్ అలీ, కమిటీ సభ్యులు పోలి గంగిరెడ్డి, మహబూబ్ బాషా, హనుమంత్ రెడ్డి, బొంద కుమారస్వామి, ఈదా రాజు, బందేలా రమేష్, బాషా, రిజ్వాన్, అమర్ తదితరులు పాల్గొన్నారు.

జన హృదయాల్లో నిలిచిన మహానేత వైఎస్సార్

– యుఎస్ఏ వైఎస్సార్‌సీపీ యువనేత చిల్లా కిరణ్

రాజంపేట : జన హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహా నేత దివంగత సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి అని యూఎస్ఏ వైఎస్సార్‌సీపీ యువనేత చిల్లా కిరణ్ అన్నారు. సెయింట్ లూయిస్‌లో దివంగత వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో అభివృద్ధి పుంతలు తొక్కించిన ఏకైక సీఎం వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి అన్నారు. అన్ని వర్గాలకు మేలు జరిగే విధంగా పాలన అందించారని, అందుకే నేటికి ఆయన ప్రజల మనసుల్లో నిలిచిపోయారన్నారు. అనంతరం ఆయన వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను పలువురు కొనియాడారు.

ఇరు వర్గాల ఘర్షణ

తొండూరు : రహదారి విషయంలో మండలంలోని కృష్ణంగారిపల్లె గ్రామంలో ఇరు వర్గాల మధ్య మంగళవారం ఘర్షణ జరిగినట్లు ఎస్సై పెద్ద ఓబన్న తెలిపారు. గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి, పల్లేటి విజయభాస్కర్‌రెడ్డిల మధ్య కొన్ని రోజులుగా రహదారి సమస్య ఉంది. మంగళవారం రహదారి వెంబడి వెళ్తుండగా ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి ఘర్షణపడ్డారు. ఇరువర్గాల వారికి చిన్నపాటి గాయాలవడంతో పులివెందుల ఆసుపత్రికి తరలించారు. సీఐ వెంకటరమణ, ఎస్సైలు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. విచారణ జరిపిన కేసు నమోదు చేస్తామని తెలిపారు.

డ్రాగా ముగిసిన మ్యాచ్‌లు



బ్యాటింగ్‌లో రాణించిన సూర్యతేజారెడ్డి



5 వికెట్లు తీసిన అనంత బౌలర్ దీపక్

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్-23 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో పలు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లు మంగళవారం డ్రాగా ముగిశాయి. కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో 129 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో బరిలోకి దిగిన కర్నూలు జట్టు 55.3 ఓవర్లలో 223 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని నిఖిత్ గౌడ్ 57 పరుగులు చేశారు. కర్నూలు బౌలర్ కనిష్ 4 వికెట్లు, సాయిసూర్యతేజారెడ్డి 3 వికెట్లు తీశాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు మూడో రోజు ఆట ముగిసే సమయానికి 9 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 82 పరుగులు చేసింది. జట్టులోని సాయిసూర్యతేజారెడ్డి 46 పరుగులు చేశాడు. చిత్తూరు బౌలర్ జావీద్ 2 వికెట్లు తీశారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా తొలి ఇన్నింగ్స్‌లో చిత్తూరు జట్టు 274 పరుగులు చేయడంతో చిత్తూరుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

తొలి ఇన్నింగ్స్‌లో అనంతపురం జట్టుకు ఆధిక్యం..

వైఎస్ఆర్ఆర్-ఏసీఏ మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో 12 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన కడప జట్టు 32.1 ఓవర్లలో 222 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని శేషాద్రి నాయుడు 75, విజయ్‌రామరెడ్డి 45 పరుగులు చేశారు. కడప బౌలర్లు దీపక్ 5, మల్లికార్జున 3 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు చివరి రోజు ఆట ముగిసే సమయానికి 52.2 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 257 పరుగులు చేసింది. జట్టులోని మహేంద్రారెడ్డి 69, యోగానంద 66 పరుగులు చేశారు. కడప బౌలర్లు అస్లాం 4, ఆదిల్ హుస్సేన్ 4 వికెట్లు తీశారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా తొలి ఇన్నింగ్స్‌లో అనంతపురం జట్టు 553 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో అనంతపురం జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

పేకాట ఆడేందుకు వచ్చి..

అనంతపురం జిల్లా వాసి ప్రొద్దుటూరులో అనుమానాస్పద మృతి



మృతి చెందిన కంబగిరి రాముడు

ప్రొద్దుటూరు క్రైం : పేకాట ఆడేందుకు వచ్చిన అనంతపురం జిల్లా వాసి కంబగిరి రాముడు (38) ప్రొద్దుటూరులో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల సమాచారం మేరకు.. అనంతపురం జిల్లా యాడికి గ్రామానికి చెందిన కొత్తూరు కంబగిరి రాముడు మరో వ్యక్తితో కలిసి కారులో మంగళవారం ప్రొద్దుటూరు సమీపంలోని కల్లూరు గ్రామానికి వచ్చాడు. ఈ క్రమంలో కల్లూరు సమీపంలోని పెన్నానది ఒడ్డున రిజర్వ్ ఫారెస్ట్ స్థలంలో అతను చనిపోయి ఉన్నాడు. మంగళవారం సాయంత్రం ఈ విషయం తెలియడంతో రూరల్ సీఐ మద్దిలేటి, ఎస్ఐ మహ్మద్‌రఫి సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అతని శరీరంపై ఎలాంటి గాయాలు లేవు. అతని వెంట వచ్చిన మరో వ్యక్తి ఇచ్చిన సమాచారం ఆధారంగా కంబగిరి రాముడు పేకాడేందుకు ఇక్కడికి వచ్చినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ఎవరైనా వెంట పడటంతో పరుగెత్తే సమయంలో గుండె పోటు వచ్చి మృతి చెందాడా? లేక పేకాట విషయమై ఏదైనా ఘర్షణ జరిగి మృతి చెందాడా? అనేది తెలియాల్సి ఉంది. డాగ్ స్క్వాడ్‌తో సంఘటనా స్థలంలో పరిశీలించారు. కొన్ని రోజుల నుంచి గ్రామంలో ఒక నాయకుడి అండతో పేకాట పెద్ద ఎత్తున జరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. మంగళవారం జరిగిన పేకాటలో 15 మంది పాల్గొన్నట్లు తెలుస్తోంది. సంఘటనా స్థలంలో ఉన్న కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పేకాట నిర్వాహకులను పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. వారి కోసం రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. పేకాట నిర్వహణపై జిల్లా ఎస్పీ సీరియస్ అయినట్లు తెలుస్తోంది.

కుటుంబ సభ్యులకు చెప్పకుండా వచ్చాడు..

యాడికి గ్రామానికి చెందిన కంబగిరి రాముడు బేల్దారి పనికి వెళ్లేవాడు. అతనికి భార్యా, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొన్ని రోజుల కొన్న సొంత కారు తీసుకొని అతను కల్లూరుకు వచ్చాడు. ప్రొద్దుటూరుకు వచ్చినట్లు తమకు తెలియదని కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు.

కడపలో అగ్నిప్రమాదం

– విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు
– ఆరు మోటార్ సైకిళ్లు దగ్ధం

కడప అర్బన్ : కడప నగరంలోని కో-ఆపరేటివ్ కాలనీలో సీటీ యూనియన్ బ్యాంకు వద్ద విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నిప్పు రవ్వలు రేగి మోటార్ సైకిళ్లపై పడ్డాయి. దీంతో మంటలు చెలరేగి అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఆరు మోటార్ సైకిళ్లు దగ్ధమయ్యాయి. మూడు మోటార్ సైకిళ్లు పూర్తిగా, మిగిలిన మూడు పాక్షికంగా మంటల్లో కాలిపోయాయి. కడప వన్‌టౌన్ ఎస్ఐ అమర్‌నాథ్‌రెడ్డి సంఘటన స్థలాన్ని చేరుకుని పరిశీలించారు. మంటలను ఫైర్ సిబ్బంది అదుపులోకి తెచ్చారు. ఐతే మంటలు చెలరేగిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో తృటిలోనే ప్రమాదం తప్పింది. కాలిపోయిన మూడు మోటార్ సైకిళ్లలో రెండు బ్యాంకు ఉద్యోగులవి కాగా, మరొకరితో పాటు, మరో మూడు మోటార్ సైకిళ్లు సమీపంలోని జిమ్‌కు వచ్చే వారివిగా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు కడప ఫైర్ అధికారి బి. బసివిరెడ్డి తెలిపారు. రూ. 5 లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు తెలిపారు.

మా వాహనాలకే ఇసుక

- కేటాయించిన రీచ్, స్టాక్ యార్డుల వద్ద కూటమి నేతల దందా
- వేగంగా టిప్పర్ లోడ్‌చేయాలంటే అదనంగా రూ.3 వేలు వసూలు



ఇసుక టిప్పర్‌లో తరలిస్తున్న దృశ్యం



రాత్రివేళ ఇటాచీతో టిప్పర్‌కు ఇసుక లోడ్ చేస్తున్న దృశ్యం

సాక్షి టాస్క్‌ఫోర్స్ : ఉచిత ఇసుక విధానం ఇసుకాసురులకు వరంగా మారింది. నిబంధనలకు పాతర వేసి చిత్రావతి నదిలో అక్రమార్కుల ఇసుక దందా కొనసాగుతోంది. పగలంతా కూలీలతో మాన్యు వల్‌గా చిత్రావతి నదిలో లోడింగ్ చేస్తున్నారు. ఇసుక రీచ్ నుంచి స్టాక్ పాయింట్ వరకు తరలించే ట్రాక్టర్ల జాబితాను పగలే అధికారులు నోట్ చేస్తున్నారు. ట్రాక్టర్ ట్రిప్పునకు రూ.200.. కూలీలకు రూ.250 చొప్పున మొత్తం రూ.450 చెల్లిస్తున్నారు. ఇదే అసరాగా తీసుకున్న అధికార పార్టీ నేతలు రోజూ 20 నుంచి 30 ట్రాక్టర్ల ఇసుక తరలించేస్తున్నారు. కేవలం పది ట్రాక్టర్ల ఇసుక నమోదుచేసి మిగిలినదంతా రాత్రివేళ్ల పక్కదారి పట్టిస్తున్నారు. తొందరగా టిప్పర్ లోడింగ్ కావాలంటే రూ.1000 నుంచి రూ.2వేల వరకు అదనంగా రాబడుతున్నారు. పర్యవేక్షించాల్సిన వారే భాగస్వాములు కావడంతో ఇసుక మాఫియాకు అడ్డుకట్ట లేకుండాపోతోంది.

ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతరు

వైఎస్సార్ జిల్లా కొండాపురం మండలంలో ఏటూరు, పెంజి అనంతపురం వద్ద ఏర్పాటుచేసిన స్టాక్ యార్డులను గతంలో ఆగస్టు 25న జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ పరిశీలించారు. ఎంతవరకు అనుమతులు ఇచ్చామో అక్కడ హద్దులు ఏర్పరచి జెండాలు పాతాలని సూచించారు. సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం జేసీతో కలిసి కలెక్టర్ లోతేటి శివశంకర్ పరిశీలించారు. ఇసుక పారదర్శకంగా వినియోగదారులకు ఇవ్వాలని ఆదేశించారు. రీచ్, స్టాక్ పాయింట్ల వద్ద పోలీసులు, రెవెన్యూ అధికారులు, ఎంపీడీఓ, వెలుగు కార్యాలయ సిబ్బందిని నియమించి విధుల్లో భాగస్వాములను చేశారు.

టీడీపీ నేతల వాహనాలకే లోడింగ్

ఏటూరు, పెంజి అనంతపురం ఇసుక స్టాక్ పాయింట్లను గుప్పెట్లో పెట్టుకున్న కొందరు కూటమి ముఖ్య నేతలు రంగంలోకి దిగి విధుల్లో అన్ని శాఖల అధికారులు, సిబ్బందిని తమ దారికి తెచ్చుకుని ఇసుక దందా మొదలెట్టారు. స్టాక్ పాయింట్ల వద్ద ఉంచి.. కూటమి నేతల వాహనాలకు మాత్రమే ఇసుక లోడ్ చేయిస్తున్నారు. సామాన్య ప్రజలు వస్తే గంటలపాటు వేచి ఉండాల్సిందే. తొందరగా కావాలంటే టిప్పర్ లోడ్ చేయడానికి రూ.3 వేలు అదనంగా వసూలు చేస్తున్నారు. ఇసుక అవసరమైన ప్రజలు స్టాక్ పాయింట్ వద్ద క్యూలో ఉన్నా చివరికి కూపన్లు అయిపోయాయి... రేపే లోడింగ్ చేస్తామని చెప్పడంతో టిప్పర్ల డ్రైవర్లు నానా వస్థలు పడుతున్నారు. అక్రమ ఇసుక దందా అరికట్టేందుకు జిల్లా అధికారులు చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్

వేంపల్లె : స్థానిక పాపాఘ్ని నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు సీజ్ చేసినట్లు వేంపల్లె సీఐ ఏ.సురేష్ రెడ్డి తెలిపారు. మంగళవారం అర్ధరాత్రి తమ సిబ్బందితో కలిసి పలుచోట్ల దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో పాపాఘ్ని నది నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని స్టేషన్‌కు తరలించినట్లు ఆయన వెల్లడించారు. సీఐ మాట్లాడుతూ ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ తిరుపాల్ నాయక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

